రహదారులే పార్కింగ్ స్థలాలు..!

- ప్రధాన మార్గాలు, బీచ్ రోడ్డులో ట్రాఫిక్ పరేషాన్
- కమర్షియల్ నిర్మాణాల్లో కనిపించని సెల్లార్లు
- వాహనాల రాంగ్ పార్కింగ్‌తో ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు, ట్రాఫిక్ పోలీసులు



రుషికొండ బీచ్ వద్ద ప్రధాన రహదారిలో పార్క్‌చేసిన వాహనాలు

కొమ్మాది: ఎండాడ, రుషికొండ, సాగర్‌నగర్ ప్రధాన రహదారులన్నీ పార్కింగ్ స్థావరాలుగా మారిపోయాయి. ఈ ప్రాంతాల్లో బహుళ అంతస్తుల కమర్షియల్ నిర్మాణాలు జరిగిన నేపథ్యంలో ఎక్కడా సెల్లార్లు లేకపోవడంతో నేరుగా రోడ్డు మీదే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఏ చిన్న వాహనం వచ్చినా గంటలు తరుబడి వేచి ఉండాల్సి వస్తోంది.



ఎండాడ 100 అడుగుల రోడ్డులో సెల్లార్లు లేక రోడ్డుపైనే పార్కింగ్

ట్రాఫిక్ నియంత్రణలో విఫలం

8వ వార్డు రుషికొండ, సాగర్‌నగర్ ప్రాంతాల్లో పలు కళాశాలలు, పర్యాటక ప్రాంతాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు వంటివి ఉండటంతో ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. ట్రాఫిక్ నియంత్రణలో అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో కొన్ని పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధి, మరికొన్ని ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోకి రావడంతో సమస్య తమది కాదంటే తమది కాదని పోలీసులు తప్పించుకుంటున్నారు. ద్విచక్ర వాహనాల నుంచి భారీ వాహనాల వరకు రోడ్డు మీదే పార్క్‌చేయడంతో ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా అనేకం. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



రుషికొండ బీచ్‌కు వెళ్లే మార్గానికి ఇరువైపులా నిలిపిన వాహనాలు

ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్య

- ఎండాడ-రుషికొండ వందడుగుల రహదారిలో ఇరువైపులా భారీ కమర్షియల్ భవంతులు నిర్మించారు. వీటికి ఎక్కడా సెల్లార్లు లేని పరిస్థితి. దీంతో రోడ్డుపైనే ద్విచక్ర వాహనాలు, కార్లు పార్క్‌చేస్తున్నారు.
- పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌కు వెళ్లే దారిలో వందలాది వాహనాలు రోడ్డు మీదే నిలుపుతున్నారు.
- విశాఖ-భీమిలి బీచ్ రోడ్డు మార్గం మధ్యలో రుషికొండ రహదారిని ఆనుకుని కొన్ని ఫుడ్ కోర్టులు ఇటీవల ఏర్పాటు చేశారు. ఎక్కడా పార్కింగ్ స్థలం కేటాయించ లేదు. దీంతో ప్రధాన రహదారులపైనే వాహనాలు పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీచ్ రోడ్డు వెంబడి బార్ అండ్ రెస్టారెంట్లు అధికమయ్యాయి. వీటికి కూడా ఎక్కడా పార్కింగ్ స్థలాలు లేవు. నిబంధనల ప్రకారం పార్కింగ్ స్థలం చూపిస్తే తప్ప జీవీఎంసీ అనుమతులు ఉండవు. ఇవన్నీ కేవలం కాగితాలకు మాత్రమే పరిమితమైన దుస్థితి ఏర్పడుతుంది.



రోడ్డుపై రాంగ్ పార్కింగ్‌లో కార్లు

నిత్యం ట్రాఫిక్ సమస్యలు



విశాలమైన రోడ్డు ఉన్నప్పటికి వాహనాల రాంగ్ పార్కింగ్ వల్ల ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా ఎండాడ వందడుగుల రోడ్డు వద్ద వాణిజ్య సముదాయాలు గణనీయంగా పెరిగాయి. వీటి వల్ల ఇక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు పరిశీలించి చర్యలు చేపట్టాలి. – దువ్వి వాసు, సాగర్‌నగర్

ప్రత్యేక నిఘా అవసరం



వ్యాపార నిర్మాణాలు చేపట్టే ముందు సంబంధిత అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వాటి అనుమతులు పరిశీలించాలి. వ్యాపార సముదాయాల ముందు రాంగ్ పార్కింగ్ చేసిన వాహనదారులపై పోలీసులు చర్యలు తీసుకోవాలి. ట్రాఫిక్ సమస్య వల్ల 10 నిమిషాల్లో చేరుకోవాల్సిన గమ్యాన్ని 30 నిమిషాల్లో ప్రయాణించాల్సి వస్తోంది. – బొబ్బిలి చిన్న, ఎండాడ

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

బీచ్ రోడ్డులోని వాణిజ్య సముదాయాలకు ఇప్పటికే నోటీసులు అందజేశాం. రోడ్డుపై పార్కింగ్ చేసే వారిపై చర్యలు తీసుకుంటున్నాం. వ్యాపారులకు కూడా ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే ప్రధాన కూడళ్ల వద్ద రోడ్లపై పార్కింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్ నియంత్రణకు తగు చర్యలు తీసుకుంటున్నాం. – ప్రసాద్, ట్రాఫిక్ సీఐ, ఆరిలోవ

ఉత్సాహంగా స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కొమ్మాది: స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్-2024 పోటీలు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గురువారం ఉత్సాహంగా జరిగాయి. స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్(ఎస్‌ఐహెచ్)లో 7వ సంచికను ఈ నెల 11న ఏకకాలంలో దేశమంతటా 51 నోడల్ కేంద్రాల్లో ప్రధాని మోదీ ప్రారంభించారు. ఇందులో భాగంగా సాఫ్ట్‌వేర్ ఎడిషన్‌ను 36 గంటలు పాటు ఎలాంటి విరామం ఇవ్వకుండా నిర్వహిస్తూ హార్డ్‌వేర్ ఎడిషన్ మాత్రం ఈ నెల 15వ తేదీ వరకు కొనసాగించనున్నట్లు గీతం పర్యవేక్షకుడు రాజ్‌కుమార్ తెలిపారు. దేశం నలుమూలల నుంచి హాజరైన విద్యార్థి బృందాలు హ్యాక్‌థాన్ పోటీల్లో వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, పరిశ్రమలు ఇచ్చిన సమస్యలపై కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు.

సచివాలయంలో కుక్కలు



నిడిగట్టు సచివాలయంలో సంచరిస్తున్న కుక్క

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు సచివాలయంలో అధికారులు ఉన్నా లేకపోయినా కుక్కలు మాత్రం చక్కగా సంచరిస్తున్నాయి. పలు సమస్యలపై సచివాలయానికి వచ్చిన ప్రజలకు కుక్కలతో బెడదగా మారింది. అవి ఎవరిపై దాడి చేస్తాయోననే ఆందోళనతో నిత్యం ప్రజలు సమస్యలను ఎదుర్కొంటున్నారు. అధికారులైనా సచివాలయం నుంచి ఈ కుక్కలను పంపించే ప్రయత్నం చేయకపోవడం విశేషం. ఇక్కడ ఉన్న సచివాలయం బోర్డును మూసివేశారు. ఇక్కడికొచ్చిన వారికి ఇది సచివాలయం అవునా కాదనే అనుమానం ఉత్పన్నమవుతోంది. సబంధిత అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

రైతుల ఆందోళన విజయవంతం చేయండి

తగరపువలస: కలెక్టరేట్ వద్ద శుక్రవారం ఉదయం జరగనున్న రైతుల ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆనందపురం ఎంపీపీ మజ్జి ప్రియాంక శారద పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ పిలుపు మేరకు రైతుల సమస్యలపై ఈ ఆందోళన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. మండలానికి చెందిన రైతులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు ఉదయం 8.30 గంటలకు ఆనందపురం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుంటే అక్కడ నుంచి బయలుదేరనున్నట్లు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు తెలిపారు.

నేడు ప్రజా వేదిక

పద్మనాభం: మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2023 మార్చి నుంచి 2024 మార్చి వరకు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనుల్లో సామాజిక తనఖీ బృందం సభ్యులు గుర్తించిన లోపాలను ప్రజా వేదికలో వెల్లడించనున్నారన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి నాయకులు, స్థానిక ప్రజలు హాజరు కావాలని ఆయన కోరారు.

మొగదారమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కొమ్మాది: బీచ్ రోడ్డులోని సాగర్‌నగర్ శ్రీ మొగదారమ్మ మహాలక్ష్మి ఆలయంలో గురువారం మార్గశిర మాస ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 7 గంటలకు అభిషేకం, అష్టలక్ష్మీ ఆరాధన, విశేషంగా శ్రీ మహాలక్ష్మి హోమం నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించుకున్నారు.

నేటి నుంచి శిల్పారామంలో చేనేత మేళా

పీఎం పాలెం: స్థానిక శిల్పారామంలో గురువారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన – అమ్మకం, స్టాల్స్ ప్రారంభమవుతాయని పరిపాలన అధికారి టి.విశ్వనాథ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేత కళాకారులు తయారు చేసిన వస్త్రాలు అందబాటు ధరలకే లభిస్తాయని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జడ్జి నాగేశ్వరరావుకు సత్కారం



జడ్జి నాగేశ్వరరావును సత్కరిస్తున్న న్యాయవాదుల సంఘ సభ్యులు

భీమునిపట్నం: భీమిలిలోని న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఆయన సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొంది అనకాపల్లి కోర్టుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావును న్యాయవాదుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వి.పార్వతీశం, కె.ఎస్.ఎం.సుధాకర్, జడ్జి సౌజన్య ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాత్రుడు, సునీల్, భరద్వాజ్ పాల్గొన్నారు.

'పీఎం సూర్యఘర్ యోజన'పై అవగాహన నేడు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కల్యాణ మండపంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు పీఎం సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన కార్యక్ర మం జరుగనుంది. ఈ మోడల్ సోలార్ గ్రామంలో నిర్వహించనున్న అవగాహన కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల వినియోగదారులు హాజరు కావాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు.

దత్తారావు పవార్‌ను కఠినంగా శిక్షించాలి



తాళ్లవలస ఎస్సీ కాలనీలో నిరసన వ్యక్తం చేస్తున్న దళిత నాయకులు

తగరపువలస: ఇటీవల మహారాష్ట్రలోని పర్బానీలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం ముందు రాజ్యాంగాన్ని చించి అవమానించిన సోపన్ దత్తారావు పవార్‌ను కఠినంగా శిక్షించాలని కోరుతూ దళిత సంఘాలు గురువారం ఆందోళన నిర్వహించాయి. భీమిలి మండలం తాళ్లవలస ఎస్సీ కాలనీ వద్ద నాయకులు మానవహారం, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా మాల మహానాడు వ్యవస్థాపకుడు భాగం గోపాలరావు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 77 ఏళ్లు గడుస్తున్నా మతోన్మాదులు, కులతత్వవాదులు ఇప్పటికీ రాజ్యాంగాన్ని, అంబేడ్కర్‌ను విమర్శిస్తూనే ఉన్నారన్నారు. షెడ్యూల్ కులాల వారికి రిజర్వేషన్లు కల్పించారన్న అగ్రవర్ణాలు దానిని బూచిగా చూపిస్తూ దళితులను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు తగ్గాలన్నారు. పవార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి శిక్షించాలన్నారు. అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బోని సన్నిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భాగం లక్ష్మి, సింహాద్రి రాంబాబు, మామిడి శివకుమార్, వీర కుమార్, బోని ప్రసాద్, నరసింగరావు, ముత్యాలు, శివ, జె.దాసు తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న కానూరి రాంబాబు

తగరపువలస: వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వం అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని సీపీఎం కార్యదర్శి కానూరి రాంబాబు కోరారు. గుజ్జు రామునాయుడు భవన్‌లో గురువారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా ఉమ్మడి కుటుంబం నుంచి వేరుపడిన వారికి, వితంతువులకు, దివ్యాంగులకు వీటిని అందించాలన్నారు. చిట్టివలస లేబర్ వెల్ఫేర్ సెంటర్ అసాంఘిక కార్యక్రమాలకు, మందుబాబులకు అడ్డాగా మారిందన్నారు. దీంతో చుట్టుపక్కల నివసిస్తున్న వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బొగ్గు రోడ్డు సచివాలయం ప్రజలకు దూరంగా ఉన్నందున లేబర్ వెల్ఫేర్ సెంటర్‌ను సచివాలయంగా మార్చి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, సన్నిబాబు, లక్ష్మణరావు, అప్పారావు, ఆదినారాయణ, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకు నీరు వృథా



పాత కురపల్లిలో ట్యాంకు నుంచి వృథాగా పోతున్న నీరు

పద్మనాభం: మండలంలోని పాత కురపల్లిలో గల వాటర్ ట్యాంకు నుంచి నీరు వృథాగా పోతోంది. ఈ ట్యాంకు నీరు ఉప్పుగా ఉండటంతో స్థానికులు తాగడానికి వినియోగించడం లేదు. స్నానాలు చేయడానికి, వాడుకలకు మాత్రమే ఉపయోగిస్తున్నారు. ట్యాంకుకు ఉన్న కుళాయిలు పాడయ్యాయి. వాటిని దమ్మి చేసి ట్యాంకుకు ఉన్న ప్రధాన గొట్టానికి ట్యాప్ అమర్చి నీరు సరఫరా చేస్తున్నారు. గ్రామస్తులకు అవసరమైనప్పుడు నీరు సరఫరా చేయడం, అవసరం లేనప్పుడు ఆపివేయడం వంటి చర్యలు లేవు. దీంతో నిత్యం ఈ గొట్టం ట్యాప్ ద్వారా నీరు పైకి వచ్చి వృథాగా పోతోంది. సంబంధిత శాఖ అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సుకు ఆలస్యంగా అధికారులు

అసహనం వ్యక్తం చేసిన స్థానికులు

కొమ్మాది: రాష్ట ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల విషయంలో అధికారులే నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీనికి ప్రత్యక్ష సాక్ష్యమే జీవీఎంసీ 4వ వార్డు జేవీ అగ్రహారం పరిధి కొత్తవలసలో జరిగిన రెవెన్యూ సదస్సు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్దేశించిన ప్రాంతాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించాలన్నది ప్రభుత్వ నిర్ణయం. దానికి తూట్లు పొడుస్తున్నారు రెవెన్యూ అధికారులు. కొత్తవలసలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు స్థానికులు తమ సమస్యలను తెలిపేందుకు 9 గంటలకు చేరుకున్నారు. అధికారులు 11 గంటల వరకు రాకపోవడంతో తీవ్ర అసహనానికి గురై వెనుదిరిగారు. ముందస్తు సమాచారం లేకపోయినా గురువారం ఉదయం మాత్రమే తెలిసినప్పటికీ తమ సమస్యలు పరిష్కరిస్తారనే ఎన్నో ఆశలతో పనులు నిలుపుకుని సదస్సుకు వస్తే అధికారులు రాకపోవడమేంటని ప్రశ్నించారు. వాస్తవానికి ఈ సదస్సుకు డీటీ శ్రీనుబాబు రావాల్సి ఉండగా.. 11 గంటల తరువాత ఎమ్మార్వో పైలా రామారావు వచ్చి కార్యక్రమం నిర్వహించారు.

ఇది సరైన పద్ధతి కాదు

రెవెన్యూ సదస్సుకు ప్రజల కంటే అధికారులే ముందుగా వచ్చి కార్యక్రమం నిర్వహించేలా చర్యలు తీసుకోవాల్సింది పోయి ప్రజను తమ పనులు మానిపించి సదస్సుకు రప్పించి అధికారులే ఆలస్యంగా రావడంపై స్థానిక కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు అసహనం వ్యక్తం చేశారు. ఆయన సదస్సుకు ఉదయం 10 గంటలకు వెళ్లి అధికారుల కోసం 11 గంటల వరకు వేచి చూసి వెనుదిరిగారు. అధికారులు నిర్లక్ష్యంగా ఉండటం సరైన పద్ధతి కాదన్నారు.



అధికారులు లేక ప్రజలు వెళ్లిపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

కొవ్వాడ సదస్సుకు 62 దరఖాస్తులు

పద్మనాభం: మండలంలోని కొవ్వాడలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 62 దరఖాస్తులు అందాయి. మ్యుటేషన్ కోసం 30 మంది, సర్వే చేయాలని 31 మంది, 22ఏ డిలిటేషన్ చేయాలని ఒకరు దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్ కె.ఆనందరావు వీటిని స్వీకరించారు. ఆర్‌ఐ శ్యామల, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు స్పందన కరువు

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరో వార్డు పీఎం పాలెం కమ్యూనిటీ హాల్‌లో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు స్పందన కరువైంది. రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదు చేసేవారు లేకపోడండంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. స్పెషల్ ఆఫీసర్ సిహెచ్.సత్తిబాబు, రూరల్ తహసీల్దార్ పాల్ కిరణ్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి సదస్సు నిర్వహించారు. సరైన ప్రచారం లేకో మరేమోగాని కేవలం 11 మంది మాత్రమే ఫిర్యాదులు అందజేశారు. ఆఫీసర్ సత్తిబాబు మాట్లాడుతూ నిబంధనల మేరకు ఫిర్యాదు చేసిన సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామన్నారు.



అధికారులు రాకపోవడంతో సభ నుంచి వెళ్లిపోతున్న కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు



కొవ్వాడ రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆనందరావ



పీఎం పాలెం కమ్యూనిటీ హాల్‌లో ఫిర్యాదుదారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

నేటి నుంచి 'బంగారమ్మ' పునఃప్రతిష్ట ఉత్సవాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం బంగారమ్మతల్లి ఆలయ ప్రారంభోత్సవం, అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ట ఉత్సవాలను ఈ నెల 13 నుంచి 15 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు గురువారం తెలిపారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులు, పరిసర గ్రామ ప్రజలు పాల్గొని తరలించాలని కోరారు.

8 కి.మీ. ప్రయాణం.. నరకప్రాయం

అడుగడుగునా రహదారి ఛిద్రం

తగరపువలస: స్థానిక జాతీయ రహదారి నుంచి సంగివలస భీమిలి మండలం తాటితూరు మీదుగా పద్మనాభం మండలం పాండ్రంగి వరకు సుమారు 8 కిలోమీటర్ల రహదారి అడుగడుగునా ఛిద్రమైపోయింది. దీంతో ద్విచక్ర వాహనాలు, ఆటోల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా జీవీఎంసీ పరిధిలో సంగివలస నుంచి శివాలయం వరకు జీవీఎంసీ తాగునీటి పైప్‌లైన్ కోసం తవ్విన గోతులు చాలా ఇబ్బందికరంగా మారాయి. పొడి వాతావరణం ఉన్నప్పుడు దుమ్ము, దూళి, వర్షాలు పడినప్పుడు చెరువులుగా రహదారి మారిపోతుంది. భీమిలి మండలం తాటితూరు కళ్లాల నుంచి పద్మనాభం పాండ్రంగి వరకు రహదారి పొడవునా శిథిలాలే కనిపిస్తున్నాయి. ఈ మార్గంలో ఇటుక బట్టీల కారణంగా నిత్యం భారీ వాహనాలతో ఇటుకలు, మట్టి, ఊక, బొగ్గు, కలప రవాణా అవుతుంది. దీంతో బలహీనమైన రహదారులు ఆకారాన్ని కోల్పోయాయి. రవాణా సమయంలో మట్టి పెళ్లలు పడి మరింతగా రోడ్డు దెబ్బతింది. ముఖ్యంగా సామియ్యవలస, తాటితూరు కళ్లాలు, మునివానిపాలెం గ్రామాల్లో రహదారి అధ్వానంగా ఉంది. దీంతో నిత్యం చిన్న చిన్న ప్రమాదాలు జరుగుతున్నాయి. భీమిలి, పద్మనాభం, ఆనందపురం మండలాలను కలుపుతూ విజయనగరం జిల్లాలోకి దగ్గర దారిలో ప్రవేశించడానికి ఎక్కువ మంది ఈ మార్గాన్ని ఎంచుకుంటారు. అధికారులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు నిర్వహించి అందుబాటులోకి తీసుకురావాలని మూడు మండలాల ప్రజలు కోరుతున్నారు.



సంగివలస-పాండ్రంగి రహదారిలో మునివానిపాలెం వద్ద రోడ్డుపై భారీ గోతులు

111బీ బస్సును పునరుద్ధరించండి



ఐదేళ్ల కిందట భీమిలి-విజయనగరం మధ్య నడిచిన 111బీ బస్సు(ఫైల్)

భీమునిపట్నం: భీమిలి-విజయనగరం మధ్య రాకపోకలు సాగించే 111బీ బస్సును ఆర్టీసీ అధికారులు నిలిపివేయడంతో ఈ మార్గంలో ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో ప్రైవేటు విద్యా సంస్థలు ఉండటంతో ప్రతి రోజు అనేక మంది విద్యార్థులు విజయనగరం వెళ్లి వస్తుంటారు. ఉద్యోగులు, ఇతర పనుల నిమిత్తం కూడా చాలా మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గంలో పదేళ్ల కిందట విజయనగరం డిపో నుంచి ఒక బస్సు నడిచేది. దాన్ని కారణం లేకుండా అప్పట్లో అర్ధాంతరంగా నిలిపివేశారు. అప్పటి నుంచి అందరూ గత్యంతరం లేక తగరపువలస వరకు ఆటోల్లో వెళ్లి అక్కడి నుంచి బస్సులు, ఆటోల్లోను విజయనగరం వెళ్లి వస్తున్నారు. తగరపువలస జంక్షన్‌కు కొన్ని ఆర్డనరీ బస్సులు మాత్రమే వస్తాయి. అవి కూడా సకాలంలో రావు. దీంతో అవి వచ్చే వరకు వేచి ఉండాలి. ఇక్కడ బస్‌షెల్టర్ లేకపోవడం వల్ల చాలా ఇబ్బందికరంగా ఉంటోంది. ప్రయాణ ప్రయాణ ఖర్చు కూడా అధికమవుతోంది. దీనివల్ల ప్రయాణికులు నిత్యం ఇబ్బంది పడుతున్నారు.

ఏళ్ల తరబడి ఈ సమస్యను ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో ఐదేళ్ల క్రితం విజయనగరం ఆర్టీసీ డిపో భీమిలికి 111బీ నంబర్‌తో బస్సులు వేసింది. దీంతో భీమిలి-విజయనగరం మార్గంలో రాకపోకలు మళ్లీ మొదలయ్యాయి. సమస్య తొలగడంతో ప్రయాణికులందరూ ఎంతో ఆనందించారు. రెండు నెలలకే ఆ బస్సులను నిలిపేయడంతో ఆనందం ఆవిరైపోయింది. ఇక్కడి పరిస్థితి ప్రకారం ఒకటి లేక రెండు బస్సులు వేసి ఉంటే సరిపోయేది. కాని ఒక్కసారిగా ఆరు బస్సులను నడపడంతో అవి ఎక్కువైపోయి ప్రయాణికులు సరిగ్గా లేరన్న కారణం చెప్పి అన్ని బస్సులను నిలిపివేశారు. ఒక్కసారిగా అవసరానికి మించి బస్సులు నడపడం వల్ల ఇబ్బంది వచ్చిందని, అదే రెండు బస్సులను ఉంచి ఉంటే ఎంతో బాగుండేదని ప్రయాణికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి భీమిలి-విజయనగరం మధ్య రెండు బస్సులు వేయాలని, కనీసం ఒక్క బస్సునైనా నడిపితే ఎంతో మేలుగా ఉంటుందని ప్రయాణికులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వలందపేటలో భోగాపురం పోలీసుల విచారణ

తగరపువలస: చీటీలకు సంబంధించి బాధితులకు రూ.2 కోట్లకు కుచ్చుటోపీ పెట్టిన సంఘటనలో భాగంగా భోగాపురం పోలీసులు గురువారం సాయంత్రం జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు వలందపేటలో విచారణ చేశారు. ఈ గ్రామానికి చెందిన పార్వతి, లక్ష్మణరెడ్డి అనే వ్యక్తులను విచారించారు. వరలక్ష్మి, సంక్రాంతి పప్పుల చీటీలతోపాటు చీటి పాటలు నిర్వహించి బాధితులకు డబ్బులు ఇవ్వలేదని తెలిసింది. భోగాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితుల ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు ఈ ప్రాంతంలో విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.